శంషాబాద్ బస్‌స్టేషన్‌ను ఆధునీకరించాలని వినతి



మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నేతలు నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: అంతర్జాతీయ పేరుగాంచిన శంషాబాద్‌లో అస్తవ్యస్తంగా ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆధునీకరించాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. ఈ మేరకు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్ స్టేషన్ సమస్యలను వివరించడంతో పాటు జాతీయ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికులు మండు టెండల్లో, వర్షాల్లో నిలబడాల్సిన దుస్థితి ఉందన్నారు. దీనిపై గత పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శంషాబాద్‌లో బస్ టెర్మినల్ ఏర్పాటుకు ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. జాతీయరహదారిని ఆనుకుని బస్ టెర్మినల్ ఏర్పాటు ప్రతిపాదనను మరోసారి పునరుద్ధరించాలని కోరారు. స్థానికంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

శ్మశానవాటిక రోడ్డును తొలగించొద్దని వినతి



గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మణికొండ: చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న రోడ్డును తొలగించొద్దని గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డిని వట్టినాగులపల్లి గ్రామస్తులు కోరారు. వట్టినాగులపల్లి గ్రామం పక్కనే ఉన్న గౌని చెరువును ఆనుకుని శ్మశానవాటిక ఉంది. ఎవరైనా చనిపోయినప్పుడు అక్కడికి వెళ్లే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉండటం, బురదలో కాళ్లు కూరుకుపోతుండటంతో రోడ్డు వేయాలని గతంలో మున్సిపాలిటీని కోరారు. రోడ్డువేసే కొంత భూమి చెరువు శిఖంలోకి వస్తుండటంతో మున్సిపాలిటీ నిధులతో వేయలేమని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో గ్రామస్తులంతా కలిసి చందాలు వేసుకుని కొద్దిదూరం రోడ్డును నిర్మించుకున్నారు. ఈ విషయాన్ని రియల్టర్లకు అనుకూలంగా చెరువులో నుంచి రోడ్డు వేసుకున్నారని ఓ దినపత్రిక వార్తను ప్రచురితమైంది. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెళ్లి రోడ్డును తొలగించేందుకు బుధవారం యత్నించగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. సదరు రోడ్డుకు ఎలాంటి వెంచర్లు లేవని తహసీల్దార్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. నాయకులు సాయికిషోర్, గణేష్‌సింగ్, రాఘవరెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణయాదవ్, ధర్మపురి, పాపాలాల్ సింగ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ప్రారంభమైన 'నిర్వాణ-2024'



ఉత్సవాలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే నిర్వాణ-2024 గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజం ఎదుర్కొంటున్న అనేక సాంకేతిక సమస్యలను కనుగొనేందుకు యువ ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. యువత సాంకేతికంగా ఎంతో చురుకుగా ఉన్నారని, దాన్ని దేశ శ్రేయస్సు, సమాజ హితం కోసం వినియోగించాలన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు విద్యార్థులు టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ సస్టైనబుల్ ఇన్ఫ్రా వంటి అంశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేయిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 24 గంటల హ్యాకథాన్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల బహుమతులను అందజేశారు. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, శుక్రవారం క్రీడా దినోత్సవ వేడుకలు, 23వ వార్షిక దినోత్సవ వేడుకలు జరుగుతాయని వైస్ చైర్మన్ డాక్టర్ కె.రామాంజనేయులు, కన్వీనర్ డాక్టర్ సీఆర్‌కే రెడ్డిలు తెలిపారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రమాబాయి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర



సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

చార్మినార్: దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఉస్మానియా విశ్వవిద్యాలయం దూర విద్యా విభాగం సంచాలకులు ఆచార్య జి.వి.రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో సామాజిక 'సమ్మిళిత అభివృద్ధిలో మహిళల పాత్ర' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య జి.వి.రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతలు తొలగిపోయినపుడే ఆదర్శ సమాజం ఏర్పడుతుందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డా.విజయ ఖాదర్ మాట్లాడుతూ..దేశంలో గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకూ విధానపరమైన నిర్ణయాలు తీసుకునే కీలక సంఘాల్లో మహిళలకు అత్యధిక ప్రాతినిథ్యం ఉండాలని సూచించారు. ప్రముఖ శాస్త్రవేత్త కైసర్ జమీల్ మాట్లాడుతూ.. మహిళా ప్రగతితోనే సామాజిక సమ్మిళిత ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యులు డా.పి.పి.రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు కేవలం 30 శాతం రిజర్వేషన్ మాత్రమే సరిపోదన్నారు. అనంతరం పరిశోధనా పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఆచార్య జి.వి.రెడ్డి ఆవిష్కరించారు. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్.యం అనురాధ, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్ల, సదస్సు సంచాలకులు డా.వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జీఎం రాజశేఖర్, రామస్వామి యాదవ్

హఫీజ్‌పేట్ : భూగర్భ జలం పెంపునకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నీటి యొక్క ప్రాముఖ్యత, నీటి వృథా, నీరుకలుషితమవకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గురువారం హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజశేఖర్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ఈ పండగను నిర్వహించుకుంటున్నామని ఈ సంవత్సరం శాంతి కోసం నీరు అనే నినాదంతో వెళ్తున్నామన్నారు. భూమిపై తాగేందుకు ఉపయోగపడే నీరు కేవలం 1 శాతం మాత్రమేనని, అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగితా 0.12 శాతం భూగర్భ జలాలు ఉన్నాయన్నారు. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు అవసరమని, జీవ వైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే పలుచోట్ల నీటిని వృథాగా నేలపాలు చేస్తున్నామన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు ఏర్పాటుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెకర్ మారబోయిన సదానంద్ యాదవ్, సభ్యులు పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రావు, జీవీరావు, జిల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌లో చిరుధాన్యాల వాడకం మేలు

గోల్కొండ: రంజాన్‌లో ఉపవాస దీక్షలు ఉండే వారు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను వాడితే ఆరోగ్యంగా ఉండగలుగుతారని నానల్‌నగర్‌లోని ఆలివ్ హాస్పటల్స్ మెనేజింగ్ డైరెక్టర్ ఆగా ముజాహిద్ హుస్సేన్ అన్నారు. గ్రేస్స్ ఆఫ్ గుడ్‌నెస్ అనే పుస్తకాన్ని ఆసుపత్రిలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాల పట్ల ఇంకా చాలా మందికి సరైన అవగాహన లేదన్నారు. అందువల్లే తాము చిరుధాన్యాలపై ప్రత్యేకంగా పుస్తకాన్ని ముద్రించామన్నారు. చిరుధాన్యాల వాడకం, వాటి రెస్పీని కూడా ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ పుస్తకాన్ని తాము ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పీడీఎఫ్ ఫార్మేట్‌లో సాఫ్ట్ కాపీని పొందడానికి 96666 95940లో తమ పేరు, వయస్సుతో రిక్వెస్ట్ పంపాలని ఆయన కోరారు.

కొత్త మేయర్‌గా లతాప్రేమ్‌కుమార్‌గౌడ్..!

72 రోజుల హైడ్రామాకు తెర



అవిశ్వాసం నెగ్గిన కార్పొరేటర్లను సన్మానించిన ప్రజలు

బండ్లగూడ/మణికొండ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు గురువారం జరిగిన సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కొత్త మేయర్ ఎవరనే చర్చ ప్రారంభమైంది. మేయర్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో అదే కోటాలోని కార్పొరేటర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. గతం నుంచి కొత్త మేయర్‌గా లతాప్రేమ్‌కుమార్‌గౌడ్‌ను ఎన్నుకునేందుకే కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ సమావేశ తేదీని నిర్ణయించడమే ఆలస్యమని ఆమెను మేయర్‌గా ఎన్నుకుంటామని పలువురు కార్పొరేటర్లు గురువారం స్పష్టం చేశారు. దీంతో కార్పొరేషన్‌కు మొదటి మహిళా మేయర్‌గా ఆమెకు అవకాశం దక్కనుంది.

నెగ్గించుకున్న పంతం..

మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌ను పదవి నుంచి తప్పించేందుకు ఒక్కటైన 16మంది కార్పొరేటర్లు ఎట్టకేలకు తమ పంతం నెగ్గించుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో జనవరి 12 నుంచి మొదలైన అవిశ్వాసం హైడ్రామా ఎట్టకేలకు 72 రోజులకు తెరపడింది. హైకోర్టు ఆదేశాలతో వాయిదా పడటంతో స్థానికంగానే అదే పట్టుదలతో ఉండి గురువారం జరిగిన సమావేశంలో తమ ఐక్యతను చాటుకోవటంతో పాటు మహేందర్‌గౌడ్‌ను పదవి నుంచి తప్పించగలిగారు.

ఒంటెద్దు పోకడతోనే...

సమిష్టి నిర్ణయాలు తీసుకోకుండా ఒంటెద్దు పోకడతోనే పదవికి ముప్పు వచ్చిందనే చర్చ కార్పొరేషన్ పరిధిలో సర్వత్రా వినిపిస్తుంది. ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని వాటిని తీర్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, తీర్మానాలు చేయకుండా తన స్వలాభాన్ని చూసుకున్నారనే విమర్శలున్నాయి.

పట్టులేకపోవడం..

పాలనపై ఎలాంటి పట్టు లేకపోవటం, తనకు నచ్చిందే చేయాలని కార్పొరేటర్లతో పాటు అధికారులపై ఒత్తిడి చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆర్థిక లావాదేవీల్లోనూ.. కార్పొరేటర్లతో చర్చించకపోవడం కూడా కారణమనే చర్చ ఉంది. కార్పొరేటర్లలతో పాటు గతంలో పనిచేసిన అధికారులను సైతం చిన్నచూపు చూడటంతో పాటు వారిని ఎమ్మెల్యే సహకారంతో బదిలీ చేయించారనే ఆరోపణలున్నాయి.

పార్టీ మారినా దక్కని ఫలితం...

బీఆర్ఎస్ పార్టీ తరపున కార్పొరేటర్‌గా గెలిచి బండ్లగూడ కార్పొరేషన్‌కు మేయర్‌గా ఎన్నికైన మహేందర్‌గౌడ్ ఇటీవల తనకు మద్దతుగా ఉన్న 5 మంది కార్పొరేటర్లతో ఇటీవల ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పనిచేయని ముందస్తు వ్యూహం..

మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌కు వ్యతిరేకంగా ఉన్న 16 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ముందుగా తాను చేరితే పార్టీ పెద్దలు అవిశ్వాసాన్ని ఎలాగైనా తప్పిస్తారని ఎత్తుగడతో పనిచేశారు. పదవి నుంచి దించటమే తమ ఏకైక ధ్యేయంగా ఉన్న వ్యతిరేక కార్పొరేటర్లు ఆ విషయాలను పట్టించుకోకుండా తమ లక్ష్యం కోసం పనిచేసి పంతం నెగ్గించుకున్నారు.

జ్ఞానేశ్వర్‌ను కలిసిన కార్పొరేటర్లు..



జ్ఞానేశ్వర్‌తో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు

బండ్లగూడ: రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి కో- ఆపరేటివ్ ఫెడరేషన్ సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ను బండ్లగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు గురువారం ఆయన నివాసంలో కలిశారు. మేయర్ మహేందర్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన అనంతరం వారంతా ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా మేయర్‌ను ఎన్నుకునే విషయంపై ఆయన వారితో చర్చించారు. లతాప్రేమ్‌గౌడ్‌ను ఇప్పటికే మేయర్‌ను చేయాలని నిర్ణయించామన్నారు. జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేయగానే ఆ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయనకు వివరించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే అంశాన్ని కార్పొరేటర్లమంతా సమావేశమై నిర్ణయిస్తామని ఆయనకు వివరించారు.

◆ బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయం వద్దకు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వచ్చి అవిశ్వాసం నెగ్గిన కార్పొరేటర్లను కలిసి తన మద్దతు తెలిపారు. వారిని బీజేపీలోకి ఆహ్వానించినట్లు సమచారం.

కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో గురువారం కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కాపింగ్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య పథకం అమలు, ఆడిట్ ప్రక్రియలు అనే అంశాలపై చర్చించారు. యూఎస్ఏ, బెల్జియంతో పాటు భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

నేడు పశుపోషణపై సదస్సు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండల ఆధ్వర్యంలో నేడు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక విస్తరణ విభాగం అధికారి సత్యనారాయణ తెలిపారు. సుస్థిర పశు ఉత్పాదకతపై వివిధ అంశాలపై లోతైన పరిశోధన, మేధోమదనం , ఉత్పాదకత పశు సంక్షేమం అనే అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం (ఈఈఐ) విస్తరణ విద్యా సంస్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి అదార్ సిన్హా ఐసీఆర్‌టీ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ రంజన్ విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొంటారన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ మహిళా నేతలు



రంజిత్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

మణికొండ: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని మణికొండ మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ నాయకులు కలిశారు. గురువారం ఆయన నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా తిరిగి పోటీ చేయాలనుకోవటం మంచి నిర్ణయమని, గెలుపునకు తామంతా పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళా కాంగ్రెస్ గండిపేట మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్. ప్రభావతి, ఉపాధ్యక్షులు సావిత్రి, మంజుల, డాక్టర్ సదానందం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖ ప్రారంభం

గచ్చిబౌలి: యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖను గచ్చిబౌలిలోని శిల్పావ్యాలీ రోడ్‌లో గురువారం శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతి యాదవ్ ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి క్లస్టర్‌లో ఓ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ మాధవి, శ్రీనివాస్, స్థానికులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ ఖాయం

నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాదిగ దండోర రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు జంగయ్య, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జాన్, ప్రధాన కార్యదర్శి గుండ్ల శ్రీనివాస్, నాయకులు శోభ, సరస్వతీలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ 10 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో శేరిలింగంపల్లి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాలనీలు, బస్తీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి, నాయకులు బాలింగ్ యాదగిరిగౌడ్, సంగమేష్, రవి, వెంకట్, కృష్ణ, రమణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్కీ'లో ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, బిగ్‌డేటా ఎనలిటిక్స్, ఏఐపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాండిచ్చేరి యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బ్యాంకింగ్ టెక్నాలజీతో కలిసి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిరాకిల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నిపుణుడు మధు వడ్లమాని, బ్లాక్ చెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపాధ్యక్షుడు అశ్వక్‌షేక్ పాల్గొని బ్యాంకింగ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ చివరి ఏడాది విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీ అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడం ద్వారా పరిశ్రమ, విశ్వవిద్యాలయాల మధ్య అంతరాన్ని తగ్గించడం, నైపుణ్య ఆధారిత శిక్షణపై చర్చించారు.

క్షేత్రస్థాయిలో పంటల సందర్శన

విద్యార్థులతో కలిసి పూలు, కూరగాయల పంటలను సందర్శించిన శాస్త్రవేత్తలు



కూరగాయల తోటలలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులు



ఉద్యాన విశ్వవిద్యాలయంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

ఏజీవర్సిటీ: జాతీయ సేవా పథకంలో భాగంగా నాల్గోరోజు శంషాబాద్ మండల పరిధి మల్కారంలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కలిసి పూలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, బెండ, టమాటా,గోరు చిక్కుడు, పాలకూర, మెంతికూర, పూదీనా, కొత్తిమీర, క్యాబేజీలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి కూరగాయల విభాగపు శాస్త్రవేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ కే నిరోషా రైతులకు తగిన సూచనలు చేశారు. ప్రధానంగా కూరగాయ పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడిని పొంది సరైనా గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. డాక్టర్ వి. కృష్ణవేణి వృక్ష వ్యాధి నిర్ధారణ నిపుణులు, డాక్టర్ వేణుగోపాల్ కీటక శాస్త్ర నిపుణుల ఆధ్వర్యంలో వివిధ పూలు, కూరగాయల పంటలకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. కీటకాల్లో కూడా మిత్ర కీటకాలు, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగినా మోతాదులో వాడాలని వివరించారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారులు సీఎస్ఆర్ సంతోషిని, లావణ్య, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఏజీవర్సిటీ: జాతీయ సేవా పథకంలో బాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే రక్తదానం మహా గొప్పదని ఒక యూనిట్ రక్తదానం చెయ్యడం వలన దాదాపు ఆరుగురి ప్రాణాలను కాపాడొచ్చని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయొచ్చని వివరించారు. ఉస్మానియా ఆసుపత్రి సిబ్బంది దాతల నుంచి రక్తనిధిని సేకరించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందించిన డాక్టర్ అవినాష్

మణికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మణికొండ మున్సిపాలిటీ, తిరుమలహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ అన్నారు. కాలనీకి చెందిన విద్యార్థులు కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గలో వర్షిణి యోగ అసోసియేషన్, కల్చరల్ ట్రస్ట్ వారు నిర్వహించిన యోగాసన పోటీల్లో 6 మంది క్రీడాకారులు పతకాలను సాధించారు. దీంతో వారిని గురువారం కాలనీపార్కులో ఆయన అభినందించారు. ప్రశాంత్ కన్నన్, నిత్య అమూల్యలకు మొదటి స్థానం, వరుణ్‌ప్రసాద్ ద్వితీయ స్థానం, అచ్యుత్, రాహుల్‌కేత, జిష్ణు ప్రనస్య, రియాకేతలు తృతీయ స్థానాల్లో నిలిచారని కోచ్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘ నాయకులు రంగాచారి, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ నేతల కూమార్తెల వివాహాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. పీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆయన నివాసంలో కలిసి నార్సింగికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేణుగౌడ్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ గండయ్య కుమార్తెల వివాహాలు ఈనెల 28న ఉన్నాయని, వాటికి తప్పనిసరి రావాలని ఆహ్వానించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, నాయకులు శ్రీపాల్‌రెడ్డి తదితరులున్నారు.

రూ.1.43 కోట్ల ఆస్తిపన్ను చెల్లింపు



వసూళ్ల చెక్కును డీసీకి అందజేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను బకాయిదారులు తమ పన్నును సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. రాజేంద్రనగర్ వెటర్నరీ సైన్స్ కళాశాలకు చెందిన అసోసియేట్ డీన్ నుంచి రూ.1.43 కోట్ల ఆస్తిపన్నును వసూలు చేశారు. టీఐ యాదయ్య, బీసీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఎస్ఓటీ పోలీసుల దాడులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు సర్కిల్ పరిధిలోని పలు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గురువారం జరిగిన దాడుల్లో 90 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులపై దాడి చేసి 14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎస్ఓటీ పోలీసులు ఈ దాడులను నిర్వహించారు. అర్ధరాత్రి వరకు విక్రయాలు జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో ఈ దాడులు కొనసాగించారు. విచారణ నిమిత్తం రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.